# సీఎం గిరి వికాస్ పేరు మార్పు

**కొత్తగా ఇందిర సౌర గిరి జల వికాసం**

ఏటూరునాగారం, మే 15 : ఏజెన్సీలోని గిరిజన ప్రాంతాల్లో ఉన్న భూములకు సాగు నీటి సౌకర్యం కల్పించడం, భూములను చదును చేయడం, బోర్లు వేయించడం, మోటార్లు ఇవ్వడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సీఎం గిరి వికాస్ స్కీంను ప్రభుత్వం అమలు చేస్తున్నది. కాగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల ఈ స్కీం పేరును ఇందిర సౌర గిరి జల వికాసం స్కీంగా మార్చింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనుల భూముల అభివృద్ధి కోసం జిల్లాల వారీగా ఉన్న డీఆర్‌డీఏలకు నిధులను విడుదల చేసింది. బీఆర్ఎస్ అధికారంలోకి రాక ముందు ఈ పథకం ఇందిర జల ప్రభగా కొనసాగేది. దీనిని బీఆర్ఎస్ సీఎం గిరి వికాస్‌గా మార్చింది. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిర సౌర గిరి జల వికాసం గా మార్పు చేసింది. అయితే ఈ పథకం కింద ఇక నుంచి ఐటీడీఏలకు నిధులు విడుదల చేయనున్నట్లు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వెయ్యికి పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రెండేళ్లుగా ఈ పథకం కింద నిధులు విడుదల కావడం లేదు. దీంతో అనేక ప్రాంతాల్లో జరుగుతున్న భూమి అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

# కర్రెగుట్ట ఎన్‌కౌంటర్‌లో మండల వాసి మృతి

- **మావోయిస్టు పార్టీలో బెటాలియన్ డాక్టర్ టీమ్ కమాండర్‌గా చందు**
- **ఏటూరు గ్రామంలో అలుముకున్న విషాదఛాయలు**



చందు అలియాస్ రవి (ఫైల్)

కన్నాయిగూడెం, మే 15 : తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న కర్రెగుట్టల్లో కొన్ని రోజులుగా కేంద్ర పోలీస్ బలగాలు మావోయిస్టులను ఏరివేసేందుకు చేపడుతున్న ఆపరేన్ కగార్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో మండలానికి చెందిన మావోయిస్టు నేత సాదపల్లి చందు అలియాస్ రవి (25) మృతి మృతి చెందాడు. మండలంలోని ఏటూరు గ్రామానికి చెందిన అన్నపూర్ణ-వెంకటేశ్వర్లు దంపతులకు రాజు, చందు ఉన్నారు. ఇంటర్మీడియట్ వరకు చదివిన చందు భద్రాచలంలోని ఓ వైద్యశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న సమయంలో మావోయిస్టు భావజాలానికి ఆకర్షితుడై రెండేళ్ల క్రితం ఉద్యమంలో చేరాడు. పార్టీలో బెటాలియన్ డాక్టర్ టీమ్ కమాండర్‌గా, కేంద్ర కమిటీ సభ్యుడు దామోదర్‌కు అత్యంత సమీపంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. కాగా, చందుపై రూ.8 లక్షల రివార్డు కూడా ఉన్నట్లు తెలిసింది. కర్రె గుట్టల ప్రాంతంలో ఈ నెల 6,7 తేదీల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో చందు మృతి చెందాడు. ఈ విషయం తెలియక మృతదేహం కోసం ఎవరు పోకపోవడంతో మృతదేహాన్ని పోలీసులు భద్రపర్చి ఉంచారు. చందు మృతి వార్త గ్రామాన్ని విషాదంలో ముంచింది. గురువారం కుటుంబ సభ్యులు చందు మృతదేహాన్ని స్వగ్రామమైన ఏటూరుకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.



కాటారంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

# కాటారంలో పోలీస్ పికెటింగ్

కాటారం, మే 15 : కాళేశ్వరంలో ప్రారంభమైన సరస్వతీ పుష్కరాల సందర్భంగా కాటారంలో ప్రత్యేకంగా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. పెద్దపల్లి జిల్లా మంథని, భూపాలపల్లి జిల్లా నుంచి కాళేశ్వరానికి భక్తులు కాటారం మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. మండలకేంద్రం గారెపల్లి ప్రధాన కేంద్రం కావడంతో భక్తుల వాహనాల వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ఎస్పీ కిరణ్‌ఖరే ఆదేశాల మేరకు డీఎస్పీ రాంమ్మోహన్‌రెడ్డి నేతృత్వంలో సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. గారెపల్లి ప్రధాన చౌరస్తా వద్ద పికెటింగ్ ఏర్పాటు చేసి వాహనాలను ఒక్కొక్కటిగా పంపిస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నిరసన తెలిపే అవకాశం ఉండడంతో ప్రతిపక్ష నాయకులైన బీఆర్ఎస్, బీజేపీ, దళిత బంధు, పలు సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. వారిలో బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు రామిళ్ల కిరణ్, నాయకులు రామిళ్ల రాజు, బీజేపీ, పలు సంఘాల నాయకులు దుర్గం తిరుపతి, బొడ్డు స్మరణ్, బొడ్డు రాజబాపు, శ్రీశైలం, రవీందర్, శివకుమార్ ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మహాముత్తారం, మే 15 : మండలంలోని నర్సింగాపూర్‌లో గుడికందుల సతీశ్ ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబానికి బీఆర్ఎస్ యువ నాయకుడు లక్కిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదేశాల మేరకు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5,016 ఇచ్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**HOUSE FOR SALE**

★Property for sale at Kishanpura near Chaitanya Degree College Hanamkonda , Warangal Urban Ground floor 2 BHK and 1 BHK with 2200 sq.ft , First & Second floor Slab laid 2200 sq.ft Each floor and Pent house 1030 sq.ft Slab laid Total square feets 7630. Per Sft. 4000/- negotiable Please Contact **+91-7382963363**. Location : 18°00'45.6"N 79°33'41.0" E (270 yards) STRICTLY NO BROKERS SERIOUS ENQUIRIES ONLY.

NTW-000

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565



ఎండుతున్న మొక్కలతో చిట్యాల పల్లె ప్రకృతి వనం



నవాబుపేటలో చెత్తాచెదారంతో పేరుకపోయిన పల్లె ప్రకృతి వనం

# పల్లె ప్రకృతి వనాల నిర్వహణపై పట్టింపేది..?

- **బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామ గ్రామాన పీపీవీ ఏర్పాటు**
- **కాంగ్రెస్ పాలనలో ఆదరణ కరువు**

చిట్యాల, మే 15 : ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. మండలంలో మొత్తం 25 పంచాయతీలు ఉండగా, 17 ఆమ్లెట్ విలేజ్‌లతో పాటు అన్నింటా పీపీవీలను ఏర్పాటు చేశారు. లభ్యమైన చోట మూడు నుంచి ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిలో మొక్కలు నాటగా ప్రసుత్తం కొన్నిచోట్ల వనాలుగా మారాయి. కొన్ని చోట్ల దొరికిన మేరకు చిన్నగా వనాలను ఏర్పాటు చేశారు. కానీ, చిన్న వనాల సంరక్షణలో అధికారుల నిర్లక్ష్యంతో మొక్కల పెరుగుదల ఆగిపోవడమే కాకుండా, వాటి తరుగుదల ఏర్పడి పీపీవీల్లో మొక్కలు తగ్గిపోయాయి. రెండేళ్లు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ విభాగం పర్యవేక్షణ చేయడంతో ఇబ్బంది లేకుండా ఉంది. ఆ తర్వాత వీటి నిర్వహణ బాధ్యతలను పంచాయతీలకు అప్పగించారు. సిబ్బంది కొరతతో అనుకున్నంత పర్యవేక్షణ లేక అడపా దడపా నిర్వహణ చేసేవారు. నడకదారులను శుభ్రం చేస్తూ పొదలను తొలగించేవారు. ప్రత్యేకాధికారుల పాలన వచ్చిన తర్వాత నిర్వహణే లేకుండా పోయింది. అంతేకాకుండా ప్రజా ప్రభుత్వ పాలనలో పల్లె ప్రకృతి వనాలపై ఆదరణ కరువైందని స్థానికులు విమర్శలు చేస్తున్నారు. జడల్‌పేట, గుంటూరుపల్లి బృహత్ పల్లె ప్రకృతి వనాలతో పాటు, ఒడితల సంపద వనంలో మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. లక్ష్మీపూర్ తండాలో సూచిక బోర్డు లేకుండా, అసలు మొక్కలే లేకుండా పీపీవీ దర్శనమిస్తుంది. చిట్యాలలో మొక్కలు ఎండుతూ కనబడుతున్నాయి. నవాబుపేట పీపీవీ చెత్తాచెదారంతో నిండిపోయింది. దీంతో వనాలు అపరిశుభ్రతకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా తయారయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించి గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలకు పూర్వ వైభవం తీసుకొచ్చి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. విషయంపై ఎంపీడీవో జయశ్రీని వివరణ కోరగా పల్లె ప్రకృతి వనాల నిర్వహణ ఈజీఎస్ నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చిన మాట వాస్తవమే. ఎండాకాలం సమీపించిన వేళ కొన్ని ప్రాంతాల్లో సరిపోను నీరు అందక మొక్కలు ఎండుతున్నాయి. ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా పల్లె ప్రకృతి వనాలకు ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నీరు పెడుతున్నామన్నారు.

## రైతులకు నష్ట పరిహారం

# చెల్లించకపోతే క్రిమినల్ చర్యలు

**మంత్రి సీతక్క**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, మే15 (నమస్తే తెలంగాణ) : రైతులకు నష్ట పరిహారం చెల్లించకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయా సీతక్క అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని అగ్రికల్చర్ డైరెక్టరేట్ కార్యాలయంలో విత్తన కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. విత్తన కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, కలెక్టర్ దివాకర, పలువురు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ వాజేడు, వెంకటాపురం (నూగూరు), కన్నాయిగూడెం మండలాల్లో నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పూర్తి పరిహారం అందించాలని కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. లేకపోతే కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టి క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు సీడ్ కంపెనీల తీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులను సమన్వయం చేసి నకిలీ విత్తనాలతో నష్టపోయిన పంటల రైతుల వివరాలు సేకరించి కంపెనీల ద్వారా పరిహారం చెల్లించాలని కలెక్టర్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. నకిలీ విత్తనాలను సరఫరా చేస్తే సహించేది లేదని, క్రిమినల్ కేసులు నమోదు చేసి జైళ్లలో వేస్తామని హెచ్చరించారు.

## సమ్మె నోటీసు అందజేత

గోవిందరావుపేట, మే15 : సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం గ్రామ పంచాయతీ వర్కర్స్ మండల కమిటీ నాయకుడు గరుగు ఐలయ్య ఆధ్వర్యంలో జీపీ కార్మికులు ఎంపీడీవో జవహర్‌రెడ్డికి సమ్మె నోటీసులను అందజేశారు. ఐలయ్య మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్మికులు కుమారస్వామి, రాజు, విజయ, కుమార్, సంపత్, వెంకన్న, సీతయ్య ఉన్నారు.



ఎంపీడీవోకు సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు



వనం తీసుకొస్తున్న తలపతి, పూజారులు

## గుమ్మడిదొడ్డిలో సడాలమ్మదేవి జాతర

వాజేడు, మే 15 : మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో సడాలమ్మదేవి(సమ్మక్క) జాతర ప్రారంభమైంది. మూడురోజులపాటు నిర్వహించే ఈ జాతరలో బుధవారం గుడిమేలిగే కార్యక్రమం పూర్తవగా రెండో రోజు గురువారం ముక్కిరిసరి గుట్ట పైనుంచి తలపతి, పూజారులు, భక్తులు వనం తెచ్చి ఆలయం వద్ద ప్రతిష్ఠించారు. అమ్మవారు గద్దెపైకి రావడంతో శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లించనున్నారు.



స్వామివారికి తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

## లక్ష్మీనర్సింహుడికి తెప్పోత్సవం

మంగపేట, మే 15 : మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి వారి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని కోనేరులో సతీసమేతంగా స్వామి వారికి తెప్పోత్సవం నిర్వహించారు. ముందుగా ఆదిలక్ష్మి-చెంచులక్ష్మి సహిత స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, పూజలు చేసి, నూతన వస్త్రాలతో అలంకరించారు. అనంతరం పల్లకీలో ఆసీనులను జేసి కోనేటి నీటిలో తెప్పోత్సవం నిర్వహించారు. వేడుకల్లో ఈవో సత్యనారాయణ, ఉత్సవకమిటీ చైర్మన్ యర్రంగారి సురేశ్, భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ అర్చకులు అమరవాది మురళీక్రిష్ణమాచార్యుల బృందం, ఆలయ అర్చకులు ముక్కామల రాజశేఖర్‌శర్మ, కారంపూడి పవన్‌కుమార్ ఆచార్యులు, ఈశ్వర్‌చందుశర్మ, సీతారాములు, సుధీర్ పాల్గొన్నారు.

# కార్మికులు సమ్మెలో పాల్గొనకుండా చూడాలి

**సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డి

కృష్ణకాలనీ, మే 15 : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనకుండా చర్యలు చేపట్టాలని జీఎం ఏ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సమ్మెపై తన కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని యూనియన్ల నాయకులు, డిపార్ట్‌మెంట్ల అధికారులు, గనుల ఏజెంట్లు, మేనేజర్లు, సంక్షేమ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ్మె చేస్తే ఆర్థికంగా నష్టపోతారని, సంస్థ సైతం నష్టాల్లోకి వెళ్తుందని కార్మికుల వివరించి చెప్పాలని సూచించారు. కార్మికుల సమ్మెలోకి వెళ్తే ప్రొడక్షన్ ఎలా తీయాలి ? తీసిన దానిని ఎలా సరఫరా చేయాలనే అంశంపై ముందు చూపుతో అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌వోటు జీఎం కవీంద్ర, ఏరియా ఇంజినీర్ ఎం ఎర్రన్న, ఏటీఎం ఐడీ జ్యోతి, ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటరామిరెడ్డి, ఏజెంట్ వన్ గ్రూప్ వెంకటరమణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జీఎల్ ప్రసాద్, ఏసీఎంవో డాక్టర్ పద్మజ పాల్గొన్నారు.

### దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్ ఆవిష్కరణ

మహదేవపూర్ : సమ్మె వాల్ పోస్టర్‌ను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీశ్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని సివిల్ సప్లయ్ గోడౌన్ వద్ద గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు రాములు, స్వామి, బాలయ్య, రాజేశ్, హరిబాబు పాల్గొన్నారు.



మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర


## బాధిత కుటుంబాలకు గండ్ర పరామర్శ

చిట్యాల, మే 15 : మండలంలోని ఒడితల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మెరుగు నాగేందర్ తల్లి పద్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే మొగుళ్లపల్లి మండలం గుడిపాడ్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ గురువారం మృతి చెందగా మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట చిట్యాల ఏఎంసీ మాజీ చైర్మన్ కొడారి రమేశ్, మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతికుమార్‌రెడ్డి ఉన్నారు.

# కాళేశ్వరంలో పుష్కరశోభ

- **మొదటిరోజు భక్తుల పుష్కర స్నానాలు**
- **ఆలయంలో ప్రత్యేక పూజలు**

మహదేవపూర్ (కాళేశ్వరం), మే 15: కాళేశ్వరం త్రివేణి సంగమం వేద మంత్రోచ్ఛారణలతో మార్మోగింది. దక్షిణాది రాష్ట్రాల్లోనే ఏకైక క్షేత్రం అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతీ సంగమంలో ఉదయం 5:44 గంటలకు పుష్కరాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. గురువారం వేకువ జామునే త్రివేణి సంగమ తీరాన సరస్వతీ నదికి పుష్కరుడిని ఆహ్వానించే కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుణ్యస్నానాలు ఆచరించారు. నది తీరం వద్ద భక్తులు పిత్రు తర్పణాలు, సంకల్ప పూజలు నిర్వహించారు. రోజుకు రెండు లక్షల మంది భక్తులు పుష్కరాలకు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేయగా, మొదటిరోజు భక్తుల రద్దీ మందకొడిగా ఉంది. సరిపడా సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. పుష్కరాలు ప్రారంభమైనప్పటికీ త్రివేణి సంగమం వద్ద ఇంకా పది రకాల పనులు కొనసాగుతుండడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.



పూజలు చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు దంపతులు



నదిలో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు



నది తీరంలో పిత్రు తర్పణాలు చేస్తున్న భక్తులు

## టేకు కలప స్వాధీనం

వెంకటాపురం(నూగూరు), మే 15 : మండలంలోని సూరవీడు అటవీ ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను గురువారం అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అటవీ శాఖ అధికారి వంశీ కథనం ప్రకారం.. సూరవీడు సమీపంలోని అటవీ ప్రాంతంలో టేకు కలపను అక్రమంగా నిల్వ చేశారనే సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో రూ.30.70 లక్షల విలువైన పది టేకు దిమ్మలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి తరలించి సూరవీడు అటవీ ప్రాంతంలో దాచి పెట్టారని తెలిపారు.

## రమణక్కపేటలో పెసా గ్రామ సభ

మంగపేట, మే15 : మండలంలోని రమణక్కపేటలో ఎంపీడీవో భద్రు అధ్యక్షతన గురువారం పెసా గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో రమణక్కపేట, గొల్లగూడెం కొమరం భీం గిరిజన ఇసుక క్వారీ లేబర్ కాంట్రాక్టు సహకార సంఘానికి ఇసుక రీచ్‌ల నిర్వహణ హక్కు కల్పిస్తూ గిరిజన ఓటర్లు చేతులెత్తి ఆమోదం తెలిపారు. మొత్తం 106 ఓటర్లుండగా 88 మంది గ్రామ సభకు హాజరై కొమరం భీం సొసైటీని ఏకగ్రీవంగా ఆమోదించారు. గ్రామ సభలో పంచాయతీ ప్రత్యేక అధికారి చందా భద్రయ్య, కార్యదర్శి కోరం రాజు, పెసా మొబిలైజర్ పోలెబోయిన యశ్వంత్, కార్యదర్శి గొంది ప్రసాద్, ఉపాధ్యక్షుడు సముద్రపు నాగరాజు, కమిటీ సభ్యులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## వీడీసీలో భాగస్వామ్యం కల్పించాలి

మంగపేట, మే 15 : మంగపేట పంచాయతీ పరిధిలోని అర్హులైన యువతకు గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)లో భాగస్వామ్యం కల్పించాలని కోరుతూ గురువారం స్థానిక యువకులు ఎంపీడీవో భద్రుకు వినతిపత్రం ఇచ్చారు. యువతను వీడీసీల్లోకి తీసుకోవాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయని మంగపేటలో మాత్రం అమలు కావడంలేదన్నారు. వెంటనే ఇక్కడున్న వీడీసీని రద్దు చేసి యువతతో నూతన వీడీసీ ఏర్పాటు చేసి గ్రామాభివృద్ధిలో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాంబాబు, మానుపెల్లి వేణు, గుగ్గిళ్ల సురేశ్, ఎర్రవుల రమేశ్, లంజపెల్లి సారయ్య, దేవేందర్, ఎట్ల అశోక్, ఎర్రవుల కృష్ణ, మాదాసు సంతోష్, నర్సింహారావు ఉన్నారు.

## ఉరేసుకొని ఒకరి మృతి

భూపాలపల్లి రూరల్, మే 15 : భూపాలపల్లి పట్టణంలో ఉరేసుకొని వ్యక్తి మృతి చెందాడు. సీఐ నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణంలోని T2-520 క్వాటర్స్‌లో నివసిస్తూ డ్రైవర్‌గా పనిచేస్తున్న వడ్డె అనిల్ (35) ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అనిల్ తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

## అక్రమ అరెస్టులతో అణచివేయలేరు

టేకుమట్ల, మే 15 : ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులు చేసి అణచివేయలేరని, ఎన్ని నిర్బంధాలు పెట్టినా ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడుతామని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపల్లి మల్లేశ్, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతిగౌడ్ అన్నారు. కాళేశ్వరంలో జరిగే సరస్వతీ పుష్కరాలకు ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అనుకున్నంత సౌకర్యాలు కల్పించలేదని ప్రశ్నించినందుకు, కాళేశ్వరానికి సీఎం రాక సందర్భంగా తమను హౌజ్ అరెస్ట్ చేసి, స్టేషన్‌కు తరలించడం దుర్మార్గమన్నారు. ఇంటికి పోలీసులు రావడంతో కుటుంబ సభ్యులు, పిల్లలు భయాందోళనలు చెందారని మల్లేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకున్నప్పుడు ప్రజలు మెచ్చే పనులు చేస్తే తాము ఎందుకు ప్రశ్నిస్తామన్నారు. ఇప్పటికైనా అక్రమ అరెస్టులను మానుకోవాలన్నారు.

## బాల్ బ్యాడ్మింటన్ కోచింగ్‌లో క్యాప్‌ల పంపిణీ

గణపురం, మే 15 : మండలకేంద్రంలోని బాల్ బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్‌కు పిల్లలకు ఎండ దెబ్బ తగలకుండా వైట్ క్యాప్‌లను ఉమ్మడి వరంగల్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సాంబయ్య గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు బాల్ బ్యాడ్మింటన్ కోచింగ్ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ భూపాలపల్లి జిల్లా సీనియర్ కోచ్ మామిడిశెట్టి రవీందర్, క్రీడాకారులు రమేశ్, చిరంజీవి, సతీశ్, మహేందర్, బుచ్చిరెడ్డి, అంజద్, ఈర్ల స్వామి పాల్గొన్నారు.

## ప్రవేశాలకు దరఖాస్తులు

భూపాలపల్లి రూరల్, మే 15 : కార్పొరేట్ ఇంటర్ కాలేజీల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 -26 విద్యా సంవత్సరానికి కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశం పొందేందుకు ప్రభుత్వ పాఠశాలలో చదివి, మార్చి 2025లో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో 7.0 జీపీఏ సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు www.telanganaepass.cgg.gov.in ద్వారా మే 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మెరిట్ ప్రకారం (CGG online Automatic System ) ప్రవేశం ఉంటుందన్నారు. వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చని సూచించారు.

## బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

వెంకటాపూర్, మే 15 : మండలంలోని నల్లగుంట- ఎల్లారెడ్డిపల్లి గ్రామాల మధ్య మూల మలుపు వద్ద బైక్ అదుపుతప్పి జవహర్‌నగర్ గ్రామానికి చెందిన పుసుల ప్రశాంత్ (25) మృతి చెందాడు. ఎస్సై జక్కుల సతీశ్ కథనం ప్రకారం.. జవహర్‌గనర్ నుంచి ఉదయం పసుల ప్రశాంత్ వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో జరిగిన పెళ్లికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో నల్లగుంట గ్రామం దాటిన తర్వాత మూలమలుపు వద్ద బైక్ ఆదుపుతప్పి కింద పడగా తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## ప్రమాదవశాత్తు వరి పంట దగ్ధం

చిట్యాల, మే 15 : మండలంలోని చింతకుంట రామయ్యపల్లి గ్రామానికి చెందిన మడికొండ శ్రీనివాస్‌కు చెందిన 20 గుంటల వరి పంట, అలాగే సాద చిన్న రాములుకు చెందిన 10 గుంటల వరి పంట, 20 పైపులు నిప్పంటుకుని గురువారం పూర్తిగా కాలిపోయాయి. అలాగే సాద మల్లయ్యకు చెందిన వరిగడ్డి కట్టలు, పైపులు అగ్నికి అహుతయ్యాయి. దీంతో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

## సమ్మెను విజయవంతం చేయాలి

గణపురం, మే 15 : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని గురువారం సింగరేణి కేఎల్‌సీలో ఫస్ట్ షిఫ్టులో జేఏసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేట్ రంగంలో రిజర్వేషన్ల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. కార్మికుల కనీస వేతనాలు అమలు చేయడం లేదని విమర్శించారు. కార్మిక చట్టాల సవరణలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. జేఏసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌లో పాల్గొన్న జేఏసీ నాయకులు, కార్మికులు